క్లుప్తంగా

పైపులైన్ లీకేజీ



పైపులైన్ లీకేజీ వల్ల వృథా అవుతున్న తాగునీరు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని రామాంజనేయపురం శ్రీ సాయి శ్రీనివాస గార్డెన్ ఎదురుగా జర్నలిస్టు కాలనీ బోర్డు పక్కన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు వృథా అవుతోంది. గతంలో ఇక్కడ మరమ్మతులు చేసినప్పటికీ లీకేజీ ఆగలేదు. నీరు యథావిధిగా వృథా అవుతూనే ఉంది. ఈ పైపులైన్ లీకేజీ వల్ల చుట్టు పక్కల బురదగా మారి రోడ్డు కూడా పాడవుతోంది. మెయిన్ రోడ్డుకు, అప్రోచ్ సీసీ రోడ్డుకు మధ్య పెద్ద గుంతలాగా ఏర్పడింది. నగరపాలక అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నాగేంద్రప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం కో ఆపరేటివ్ కాలనీలోని శ్రీ సాయిబాబా అనాథ శరణాలయంలో విద్యార్థులకు ఆదివారం మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్ పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. అలాగే విద్యార్థులకు మందులతోపాటు బిస్కెట్ ప్యాకెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ కె.నాగేంద్రప్రసాద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయిబాబా అనాథ శరణాలయం ప్రెసిడెంట్ ఎస్వీ రామ్మూర్తి, సెక్రటరీ ఎం.బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ఐ సుబ్బారెడ్డికి ఘన నివాళి



సీఆర్ఐ సుబ్బారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నేతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : బీసీ నాయకుడు సీఆర్ఐ సుబ్బారెడ్డి సామాజానికి అందించిన సేవలు ప్రశంసనీయమని బీసీ సంఘాల నేతలు, కుటుంబ సభ్యులు కొనియాడారు. సీఆర్ఐ సుబ్బారెడ్డి పదవ వర్ధంతి సందర్భంగా కడప నగరంలోని వినాయక నగర్‌లో గల ఆయన సమాధి వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, సీఆర్ఐ సుబ్బారెడ్డి సతీమణి కొరముట్ల వెంకట లక్ష్మమ్మ, కుమారులు సీఆర్ఐ సునీల్ జయంత్, దినేష్, కుటుంబ సభ్యులు గోవిందు వెంకటసుబ్బమ్మ, కొరముట్ల రాధమ్మ, కొరముట్ల చౌడమ్మ తదితరులతోపాటు తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు కల్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు, ఉపాధ్యక్షుడు చౌడం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ కార్మికుల తొలగింపు తగదు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరపాలక సంస్థ పరిధిలో చెత్తపన్ను వసూళ్లలో జరిగిన అవకతవకల్లో అప్కాస్ చిరు కార్మికులను తొలగించి, పర్మినెంట్ కార్మికులను సస్పెండ్ చేయడం తగదని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించడం చట్ట విరుద్ధమని అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో పది నెలల కాలంలో కమర్షియల్ షాపుల నుంచి వసూలు చేసిన చెత్త పన్ను వసూళ్లపై మాత్రమే విచారణ జరిపించి కార్మికులు, ఉద్యోగులను బలిపశువులు చేయకుండా.. గత ప్రభుత్వంలో క్లాఫ్ మిత్ర ఇంటింటికి చెత్త పన్ను వసూళ్లపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అవకతవకల్లో జరిగిన సొమ్ము కార్మికులు, ఉద్యోగుల నుంచి రికవరీ చేసి తొలగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయడంతోపాటు తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు పి.సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన గణనాథులు



బిల్టప్ ప్రాంతంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు




ఉగ్ర రూపంలో ఉన్న వినాయక విగ్రహం



ఒకే రంగుతో ఉన్న విఘ్నేశ్వరుడు

త్వరలో జరగనున్న వినాయక చవితి పండుగ రోజు కొలువుదీరేందుకు గణనాథులు ముస్తాబయ్యారు. కడప నగరంలోని బిల్టప్, వినాయక నగర్ సర్కిల్, రాజంపేట బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో రాజస్థాన్ ప్రాంతానికి చెందిన కళాకారులు విగ్రహాలను అందంగా తీర్చిదిద్దారు. విఘ్నేశ్వరస్వామిని వివిధ అలంకారాల్లో తయారు చేశారు. కడప నగరంలోపాటు జిల్లా నలుమూలల నుంచి కొనుగోలు చేసేందుకు ఉత్సవ కమిటీల వారు వస్తున్నారు. ముందుగానే కొంత డబ్బు (అడ్వాన్స్) చెల్లించి వెళ్తున్నారు. ఆ ప్రాంతాల్లో సందడి నెలకొంది. అటు వైపు వెళ్తున్న ప్రజలు విగ్రహాలను తదేకంగా చూస్తూ.. మురిసిపోతున్నారు. – కడప వైఎస్ఆర్ సర్కిల్



వెంకటేశ్వరస్వామి అలంకారంలో గణనాథుడు



సెంట్రల్ జైలు సమీపంలో ఏర్పడిన గుంతలు



సంజన్న సర్కిల్‌లో..

అధ్వాన రోడ్లు.. అవస్థలు చూడు

కడప నగరంలోని ప్రధాన రహదారుల్లో గుంతలు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతుల పేరుతో ఈ గుంతలను పూడ్చినప్పటికీ.. కొద్ది రోజులకే మళ్లీ యథావిధిగా గుంతలమయం అయ్యాయి. మద్రాసు రోడ్డులోని సంజన్న సర్కిల్, బైపాస్‌లో అమీర్‌బాబు పెట్రోల్ బంకు ఎదురుగా, సెంట్రల్ జైలు సమీపాల్లో లోతైన గుంతలు ఏర్పడ్డాయి. వాహనాల్లో వేగంగా వస్తున్న వారు వీటిని గుర్తించకపోతే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. లేనిపక్షంలో వాహనాలు దెబ్బతినే పరిస్థితులు ఉన్నాయి. అధికారులు స్పందించి ఈ రోడ్లను బాగు చేయాలని పలువురు కోరుతున్నారు. – కడప కార్పొరేషన్



బైపాస్‌లో పెట్రోల్ బంకు ఎదురుగా ...



సంజన్న సర్కిల్ నుంచి మినీ బైపాస్‌కు వెళ్లే మొదట్లో

బుగ్గవంకపై బ్రిడ్జిలు నిర్మించాలి



బుగ్గవంక రక్షణ గోడ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : బుగ్గ వంకపై షామీరియా, లా కాలేజీ వద్ద బ్రిడ్జిలు వెంటనే నిర్మించాలని ఏఐసీసీ కోఆర్డినేటర్ ఎస్ఏ సత్తార్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాసిర్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆదివారం షామీరియా మసీదు బుగ్గవంక రక్షణ గోడ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2001లో వచ్చిన బుగ్గవంక వరదల కారణంగా కడప నగరంలో ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందన్నారు. తదనంతరం అప్పట్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బుగ్గ వంకపైన ఆరు శాశ్వత బ్రిడ్జిలు నిర్మించిందని తెలిపారు. బుగ్గ వంక రక్షణ కూడా మంజూరు చేసిందన్నారు. అనంతరం వచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రవీంద్రనగర్ బ్రిడ్జి మాత్రమే నిర్మించిందన్నారు. బుగ్గవంక రక్షణ గోడ పనులు మొదలు పెట్టినప్పటి నుంచి షామీరియా, లా కాలేజీ వద్ద హై లెవెల్ బ్రిడ్జిలు నిర్మించాలని ఆందోళనలు చేసినా ఇప్పటి వరకు నిర్మించలేదన్నారు. గత ఎన్నికల వేళ ప్రస్తుత ఎమ్మెల్యే మాధవి రెడ్డి, ఆమె భర్త శ్రీనివాసులరెడ్డి ఈ బ్రిడ్జిలు నిర్మిస్తామని, ప్రభుత్వం సహకరించకపోతే సొంత నిధులతో నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరం కావస్తున్నా బ్రిడ్జిలు నిర్మించలేదన్నారు. పైగా ఈ రెండు చోట్ల అంబులెన్స్ తదితర వాహనాలు వచ్చే విధంగా కాకుండా మనుషులు నడిచే విధంగా బ్రిడ్జిలు నిర్మించడానికి ఎత్తుగడ వేస్తున్నారన్నారు. కానీ హై లెవెల్ బ్రిడ్జిలు సౌకర్యవంతంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అన్వర్, ఆసిఫ్ ఖాన్, కోటపాటి లక్ష్మయ్య, కర్నాటి చంద్రశేఖర్‌రెడ్డి, అక్రమ్, జాకీర్ ఖాన్, జహార్, అలీ జబ్బర్, రహమతుల్లా ఖాన్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రి గేషనల్ చర్చి సేవలు ప్రశంసనీయం



చర్చి పెద్దలను సత్కరిస్తున్న పాస్టర్ మోహన్‌బాబు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో అతి పురాతమైన చర్చిగా పేరొందిన కాంగ్రి గ్రేషనల్ చర్చి కమిటీ కార్యవర్గం అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని క్రైస్తవ ప్రముఖులు పాస్టర్ రెవరెండ్ మోహన్‌బాబు తెలిపారు. ఆదివారం కాంగ్రిగేషనల్ చర్చి 200 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంతోపాటు నూతన భవన ప్రారంభాన్ని పురస్కరించుకుని క్రైస్తవ గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రి గేషనల్ చర్చికి విశేష గుర్తింపు ఉందన్నారు. నాడు లండన్ మిషనరీ వారు ఏర్పాటు చేసిన ఈ చర్చి కాలక్రమంలో అభివృద్ధి అవుతూ భక్తుల ప్రార్థనలతో అలరారుతోందన్నారు. విశ్వాసుల ప్రార్థనలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు చర్చిని అన్ని విధాలా అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్న కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. చర్చి పెద్దలు, సంఘస్తుల సహకారంతో కార్యవర్గం అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సంజీవ రాయుడు, సెక్రటరీ విజయుడు, ట్రెజరర్ సీహెచ్‌నోవా బెన్నీ, డికాన్ రాజ మనోహర్ బాబు, డికాన్ కేటీబీ ప్రసన్నకుమార్, ఆశీర్వాదం, సుశీలమ్మ జయ కుమార్, మోహన్, చర్చి కమిటీ ప్రతినిధులు, క్రైస్తవ పెద్దలు, పెద్ద ఎత్తున విశ్వాసులు పాల్గొన్నారు.

విదేశాల్లో వైద్య విద్యపై అవగాహన



విద్యార్థినులకు బ్రోచర్ అందజేస్తున్న యూనివర్సిటీల ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిహార్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వోక్స్ ఓవర్సీస్ సహకారంతో విదేశాల్లో ఎంబీబీఎస్ చదివే అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిహార్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ రీజినల్ కోఆర్డినేటర్ నాగమణి తెలిపారు. ఆదివారం కడపలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ప్రాంగణంలో విదేశీ విద్యపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, విద్యార్థులకు విదేశాల్లో ఎంబీబీఎస్ చదువు, అవకాశాలు, వీసా ప్రాసెస్, స్కాలర్‌షిప్‌లు, యూనివర్సిటీ నిధులు వంటి అంశాలపై నిపుణులు సమగ్ర సమాచారం అందించారు. డాక్టర్ రాకేష్ సింగ్ (యూనివర్సిటీ ప్రతినిధి), షరీఫ్ (వోక్స్ ఓవర్సీస్ ప్రతినిధి) ప్రత్యేక అతిథులుగా పాల్గొని విదేశీ విద్య, ముఖ్యంగా ఎంబీబీఎస్ చదువుపై తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించారు. అనంతరం విదేశాల్లో ఎంబీబీఎస్ చదివే అవకాశాలపై రూపొందించిన బ్రోచర్‌ను విద్యార్థినులకు అందజేశారు.

వాన.. హైరానా



కడప నగరంలో ఆదివారం కురిసిన వానతో నగర వాసులు బేజార్ అయ్యారు. కొద్దిసేపు చినుకులు పడిన తర్వాత వర్షం ఆగిపోయిందని భావించినా.. తిరిగి కొద్దిసేపటికే ప్రారంభం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అత్యవసర పనులపై, సరదాగా కుటుంబాలతో బయటికి వచ్చిన వారు చినుకులతో అవస్థల పాలయ్యారు. పెద్ద వర్షం లేకపోయినా చినుకుల కారణంగా ప్రజలు కొంతమేర అసహనం వ్యక్తం చేశారు.

– కడప కోటిరెడ్డిసర్కిల్

శివానందపురంలో శివాలెత్తిన సమస్యలు



గుంతలమయంగా శివానందపురం ప్రధాన రహదారి



మురుగు కాలువపై పెరిగిన కంప చెట్లు

- సిమెంటు రోడ్డుకు నోచుకోని ప్రధాన రహదారి
- మురికి కాలువలు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు, పాలకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగర పరిధి 15వ డివిజన్ శివానందపురంలో సమస్యలు తిష్ట వేశాయి. ఈ ప్రాంతం కడప నగరంలో ఉన్నప్పటికీ.. కనీస సౌకర్యాలకు నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే వీరి బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. రిమ్స్ రోడ్డు నుంచి శివానందపురానికి వెళ్లే ప్రధాన రహదారి సిమెంటు రోడ్డుకు నోచుకోవడం లేదు. గుంతలమయంగా ఉన్న ఈ రోడ్డులో వర్షపు నీరు నిలిచి బురదమయంగా ఉంటోంది. మురికి కాలువలు లేకపోవడంతో ప్రజలు రోడ్డు సైడ్ మురికి కాలువ ఏర్పాటు చేసుకొని నీటిని వదులుతున్నారు. అరకొరగా ఉన్న మురికి కాలువలపై ముళ్లపొదలు పెరిగాయి. ఈ ప్రాంత సమస్యలను పరిష్కరించాలని అనేక మార్లు నగరపాలక సంస్థ అధికారులకు విన్నవించినా ఎటువంటి ఫలితం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. శివానందపురం ప్రధాన రహదారిని నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులకు అనేక మార్లు తెలిపినా.. కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శివానందపురంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మించాలి

రిమ్స్ రోడ్డు నుంచి శివానందపురానికి వెళ్లే ప్రధాన రహదారిపై సిమెంట్ రోడ్డు నిర్మించాలి. ఈ ప్రాంతంలో సిమెంట్ రోడ్డు లేకపోవడంతో వర్షాకాల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక మార్లు నగర పాలక సంస్థ అధికారులకు విన్నవించినా ఎటువంటి ఫలితం లేదు.

–ఓబిలి విజయ్‌కుమార్, ఆర్‌సీపీ నాయకుడు

సమస్యలు పరిష్కరించాలి

శివానందపురంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి. ఈ ప్రాంతంలో సిమెంట్ రోడ్లు, మురికి కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షా కాల సమయంలో వృద్ధులు, చిన్నపిల్లలు ఈ రహదారిలో నడవ లేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి స్థానిక సమస్యలను పరిష్కరించాలి.

–ప్రసాద్, ఆర్‌సీపీ నాయకుడు

గుంతల రోడ్డుతో ప్రజలకు ఇక్కట్లు



శివానందపురంలో రోడ్డును పరిశీలిస్తున్న ఆర్‌సీపీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : శివానందపురం రోడ్డు గుంతలతో అధ్వానంగా మారిందని, ప్రజల సౌకర్యార్థం కోసం ఈ దారిలో సీసీ రోడ్డు వేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, ఓబిలి విజయ్‌కుమార్ కోరారు. ఆదివారం నగర పరిధి 15వ డివిజన్ శివానందపురంలోని రోడ్లను ఆర్‌సీపీ నాయకులు పరిశీలించారు. ఆ ప్రాంత ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ఈ ప్రధాన రహదారి మీదుగా వందలాది వాహనాలు, వేలాది మంది ప్రజలు ప్రయాణిస్తూ ఉంటారని తెలిపారు. రహదారికి వెంటనే మరమ్మతులు చేసి శాశ్వతమైన సిమెంట్ రోడ్డును వేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంత సమస్యలను పాలకులు, అధికారులు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు శీను, సన్న, కిరిటీ, సుబ్బారాయుడు, బులుగు శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.


విలియం కేరి జీవితం.. ఆదర్శనీయం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బిషప్ సామెల్‌బాబు

కడప రూరల్ : విలియం కేరి జీవితం ఆదర్శనీయమని రెవరెండ్ బిషప్ కె.సామేలు బాబు అన్నారు. ఆదివారం స్థానిక ఎలిమ్ ప్రార్థన మందిరంలో విలియం కేరి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన జీవిత విశేషాల పైన కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం సామేలు బాబు మాట్లాడుతూ విలియం కేరి 1761లో ఇంగ్లాండ్‌లో జన్మించారన్నారు. ఆయన భారతదేశానికి మిషనరీగా వచ్చి, వెలకట్టలేని సేవలను అందించారని కొనియాడారు. ఈయన మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తెచ్చారని పేర్కొన్నారు. ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ భాస్కర్ మాట్లాడుతూ విలియం కేరి అటవీ పరిరక్షణపై రచనలు చేసిన మొదటి వ్యక్తి అని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు దాసరి సుధాకర్, దేవ వరప్రసాద్, సారిక, సువర్ణమ్మ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వెలగని వీధిలైట్లు.. కమ్ముకున్న చీకట్లు



పటేల్ రోడ్డులో వెలగని వీధిలైట్లు



వాహనాల వెలుగులో పటేల్‌రోడ్డు

కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పటేల్ రోడ్డు చిట్టచివరి వీధిలోని కుడి వైపు వీధిలో నాలుగు రోజుల నుంచి వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పాటు చీకటితో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ చీకటితో వర్షాలకు విషపురుగులు సంచరించే అవకాశం కూడా ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కావున కార్పొరేషన్ అధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేయాలని పటేల్‌రోడ్డు వాసులు కోరుతున్నారు. – కడప ఎడ్యుకేషన్

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. అలాగే గంగమ్మ దేవాలయ సమీపంలోని వీరభద్ర స్వామి, శివాలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా దేవాలయాలలో భక్తులు పూజలు చేశారు.

పెన్షన్ మార్చ్‌ను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో నూతన పెన్షన్ విధానం అమలు అయిన సెప్టెంబర్ ఒకటిన సీపీఎస్ రద్దు కోరుతూ విజయవాడలో తలపెట్టిన పెన్షన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్సార్ వెంకట జనార్ధనరెడ్డి కోరారు. స్థానికంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరం లోపు సీపీఎస్ సమస్యకు ఒక పరిష్కారం చూపుతామని చెప్పిందని, ఏడాదిన్నర గడిచినా సీపీఎస్ రద్దుపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ స్థానంలో నూతన పెన్షన్ తెచ్చి అందులో కూడా ఉద్యోగులకు కొద్దిగా మేలు జరిగేలా అనేక సంస్కరణలు చేసినా.. రాష్ట్ర ప్రభుత్వాలు ఆ సంస్కరణలు అమలు చేసిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 1న విజయవాడలో నిర్వహించే పెన్షన్ మార్చ్‌కు జిల్లా నలుమూలల నుంచి ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.